ప్రజాశక్తి
సోమవారం 15 మే 2023
8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

అద్దె షాపుల్లో అవినీతి బేరం



- టెండరు నిర్వహించకుండానే చల్లపల్లి రాజీవ్ కాంప్లెక్స్ దుకాణాల కేటాయింపులు?
- కోర్టు ఉత్తర్వులు బేఖాతర్

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

చల్లపల్లిలో మండల పరిషత్‌కు చెందిన రాజీవ్‌గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణ అద్దెల నిర్ణయంలో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ఆదాయం పెంపుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులే హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు చేస్తూ దొడ్డిదారిన ప్రస్తుత నిర్వాహకులకే నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలను అద్దెకు కేటాయించే ప్రయత్నాలు జోరందుకున్నట్లు తెలుస్తోంది. అద్దె షాపుల లీజుల వ్యవహారంలో అవినీతి బేరం సాగిందని తెలుస్తోంది. తెరవెనక పెద్దలు ద్వారా రూ.10 లక్షల వరకు చేతులు మారాయనే చర్చ జరుగుతోంది. చల్లపల్లిలోని బందరు రోడ్డు పక్కనే ప్రధాన కూడలిలో మండల పరిషత్ నిధులతో 1992లో 18 దుకాణాలతో రాజీవ్‌గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ప్రధాన కూడలిలో ఉన్న ఈ దుకాణ సముదాయానికి నెలకు రూ.34,546లు మాత్రమే అద్దెగా సమకూరేది. దీనికి ఎదురుగా రోడ్డుకు మరోవైపు ఉన్న ప్రయివేటు కాంప్లెక్స్‌లో ఒక్కో దుకాణం అద్దె నెలకు రూ.18 వేలు నిర్వాహకులు చెల్లిస్తుంటే, మండల పరిషత్ దుకాణ ఈ సముదాయంలో ఒక్కో దుకాణానికి సగటున రూ.1,919 మాత్రమే ఆదాయం వస్తోంది. ప్రయివేటు కాంప్లెక్స్ ఆదాయంతో పోల్చితే మండల పరిషత్‌కు పదో వంతు ఆదాయం లేదు.

కోర్టు ఉత్తర్వులు భేఖాతర్

కాంప్లెక్స్ అద్దెల ద్వారా మండల పరిషత్‌కు రావాల్సిన ఆదాయం రావడం లేదని స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నాలుగు నెలల్లో బహిరంగ వేలం నిర్వహించాలని 2022 డిసెంబర్ 14వ తేదీన హైకోర్టు మండల పరిషత్ అధికారులకు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే కాంప్లెక్స్ షాపులకు లీజు పొడిగింపు, అగ్రిమెంట్ లేకుండా కొనసాగడం, హైకోర్టు ఉత్తర్వులు, ఉన్నతాధికారులు సూచనలతో బహిరంగ వేలం నిర్వహించడానికి వీలుగా ప్రస్తుత దుకాణాలు నిర్వహిస్తున్న వారు నెల రోజులలోపు షాపులను ఖాళీ చేయాలని అప్పటి చల్లపల్లి ఎంపిడిఒ దుకాణదారులకు నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసులు ఇచ్చిన 48 గంటల వ్యవధిలోనే సదరు (మిగతా 6లో)



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

19న సుందరయ్య వర్థంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి-సింగ్‌నగర్

పాయకాపురంలోని ప్రకాష్ నగర్ సెంటర్‌లో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుల సిహెచ్.బాబూరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, వీర తెలంగాణ విప్లవ పోరాట రథసారధి, సిపిఎం అగ్రనేత, పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్పొరేట్లకు దాసోహం అంటున్న మోడీ విధానాలు దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అవసరం పెరిగిందన్నారు. నిత్యావసర వస్తువులు, గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచి దేశాన్ని, సామాన్యులను లూటీ చేస్తున్న బిజెపికి కర్ణాటకలో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. విద్వేష భావాలతో ప్రజలను ఏమార్చి పబ్బం గడుపుకుంటున్న మోడీ ప్రభుత్వ ఎజెండాను ప్రజలు తిరస్కరించారన్నారు. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లోను బిజెపికి దేశవ్యాప్తంగా ప్రజలు బుద్ధి చెప్పబోతున్నారనే (మిగతా 6లో)

కమ్యూనిస్టుల పునరేకీకరణ అవసరం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు చేసిన మంచి పని ఏదీ లేదని, మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారని, మోడీ పాలనకు చరమగీతం పాడేందుకు కమ్యూనిస్టుల పునరేకీకరణ అవసరముందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. పాతబస్తీ టైలర్ పేటలో శ్రామిక వర్గ చిహ్నామైన జోడు బొమ్మల ఆవిష్కరణ సందర్భంగా సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. తొలుత సిపిఐ జెండాను రామకృష్ణ ఆవిష్కరించగా, జోడుబొమ్మలను సిపిఐ సీనియర్ నాయకులు రాంపిళ్ల అప్పారావు ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో రామకష్ణ మాట్లాడుతూ రైతుల సమస్యలపై స్పందించడంలేదని, ధరల తగ్గించే ప్రయత్నం చేయట్లేదని, గ్యాస్ ధర 400 నుంచి రూ.1200కు పెరిగిందని, నిరుద్యోగ సమస్య పెరిగిందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వామపక్ష పార్టీలకు ఓ గుర్తింపు ఉందన్నారు. పేద ప్రజలు, కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలు చేసేది వామపక్ష పార్టీలు, ఎర్రజెండా మాత్రమే అన్నారు. సుమారు 60 ఏళ్ల క్రితం టైలర్ పేటలో ఏర్పాటు చేసిన జోడుబొమ్మలను తిరిగి పున:నిర్మాణం చేసిన నిర్వాహకులను అభినందించారు. కేంద్రంలోని బిజెపి, మోడీ విధానాలు, రాష్ట్రంలోని వైసిపి పాలన తీరును తిప్పికొట్టాలంటే వాపమక్ష పార్టీలు కలిసివచ్చే పార్టీలతో (మిగతా 6లో)



జోడుబొమ్మలను ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిపిఐ నేతలు

రూ.316 కోట్లతో రక్షిత మంచినీటి పథకాలు

- 50 శాతానికిపైగా విఎంసిలోని స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ పనులు పూర్తి
- ప్రజాశక్తితో ప్రజారోగ్య శాంకేతికశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భూషణం

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లాలోని పలు మున్సిపాలిటీలకు మంజూరైన రక్షిత మంచినీటి స్కీమ్స్‌ను ప్రభుత్వ ఆదేశాల కనుగుణంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రజారోగ్యసాంకేతికశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఇ.ఇ) పి.భూషణం చెప్పారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని మున్సిపాలిటీలకు మంజూరైన రక్షిత మంచినీటి స్కీమ్స్ ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయన్నారు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటడంతో పాటు కలుషితమవుతున్న నేపథ్యంలో కృష్ణానది నుంచి నీటిని మళ్లించి, శుద్ధి చేసిన వాటర్‌ను సగటు మనిషికి మంచినీరు అందించాలనే ఉద్దేశ్యంతో మున్సిపాలిటీలకు మంచినీటి స్కీమ్స్‌ను అమలు చేస్తున్నామన్నారు. గతంలో వేసి దెబ్బతిన్న స్కీమ్స్ స్థానంలో, లేదా కొత్తగా మంజూరైన మునిసిపాలిటీల్లో స్కీమ్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సహకారంతో ఈ భారీ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధుల లభ్యత ఆధారంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామన్నారు. స్కీమ్స్‌ను పూర్తి చేస్తామన్నారు. జిల్లాలోని మునిసిపాలిటీలకు మంజూరైన మంచినీటి స్కీమ్స్ వివరాలు, వాటి పనులు, నిధుల తీరు తదితర అంశాలపై ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.



వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రశ్న: జిల్లాలో మంచినీటి పథకాల తీరు ఎలా ఉంది?

జవాబు: ఎన్‌టిఆర్ జిల్లాలోని పలు మున్సిపాలిటీలలో రక్షిత మంచినీటి సరఫరా అవసరాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి, మంచినీటి స్కీమ్స్‌ను మంజూరు చేశాయి. అయితే వీటిని నిధుల లభ్యత ఆధారంగా, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, జిల్లా అధికారుల ఆదేశాలకు అనుగుణంగా పనులు ప్రారంభించి, అమలు చేస్తాం.

ప్రశ్న: జిల్లాలోని మున్సిపాలిట్లీ పథకాల పురోగతి ఎలావుంది?

జ : ప్రధానంగా జిల్లాలోని నందిగామ, తిరువూరు, జగ్గయ్యపేట తదితర మునిసిపాలిటీల్లో రక్షిత మంచినీటి స్కీమ్స్ మంజూరయ్యాయి. పథకాలు పురోగతిలోనే ఉన్నాయి.

ప్రశ్న: నిధుల మంజూరు ఎలా వుంది?

జ : నందిగామ మునిసిపాలిటీకి రూ. 89 కోట్లు, తిరువూరుకు రూ. 162 కోట్లు, జగ్గయ్యపేటకు రూ.65 కోట్లు మొత్తంగా రూ.316 కోట్లు మేర నిధులను కేటాయింపులు జరిగాయి. కేంద్రానికి సంబంధించి ఎఐఐబి బ్యాంక్‌కు సంబంధించినవి.



ప్రశ్న: పనుల నిర్వహణ తీరు ఎలావుంది?

జ : ఈ స్కీమ్స్ గత టిడిపి ప్రభుత్వ కాలంలో మునిసిపాలిటీలకు మంజూరు అయ్యాయి. రెండు ప్యాకేజీలుగా విభజించగా, హైదరాబాద్‌కు చెందిన సియాన్ ఇన్‌ఫ్రా కంపెనీ (మెగాకు సంబంధించి) పనులను చేపట్టింది. స్కీమ్స్ ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నప్పటికీ...నిధుల లభ్యతలో ఎదురవుతున్న ఇబ్బందుల రీత్యా ఇప్పటికీ కేవలం ఐదు శాతం కన్నా పనులు ముందుకు సాగలేదు. నిధుల సమస్య కారణంగా పనులు ఆగిపోయాయి. మూడు మునిసిపాలిటీల్లో నిధుల సమస్య ఎదురవుతూనే ఉంది. కేంద్రం నుంచి నిధులు మంజూరైన (మిగతా 6లో)

నత్త నడక సాగుతున్న జగనన్న కాలనీలు

ప్రజాశక్తి -నందిగామ

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే చాలీచాలని సాయం లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేయడానికి చాలడం లేదు. అప్పో సొప్పో చేసి సొంత ఇల్లు నిర్మించుకోవాలనుకుంటున్న లబ్ధిదారులు కాలనీల్లో మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారు. నందిగామ నియోజకవర్గంలోని జగనన్న కాలనీలన పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతోంది. మొత్తం నియోజకవర్గంలో 11, 424 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేయగా కేవలం 2, 086 మంది లబ్ధిదారులుమ మాత్రమే గృహాలు నిర్మించుకోగలిగారు. 9, 338 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి.

నందిగామ పురపాలక సంఘం పరిధిలో అనాసాగరం, హనుమంతుపాలెం, మునగచర్ల లేఅవుట్ పరిధిలో 1620 మంది లబ్ధిదారులకు గహాలు మంజూరవ్వగా 232, నందిగామ మండలంలో 1520 గృహాలకు 345, కంచికచర్లలో 3,338 గృహాలకు 508, వీరులపాడులో 2314 గృహాలకు 427, చందర్లపాడులో 2,632 గృహాలకు 574 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి.



అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం

పెరిగిన నిర్మాణ సామాగ్రి ధరలు

ఇటీవల కాలంలో భవన నిర్మాణాలకు అవసరమైన ఇనుము, సిమెంట్, కంకర ధరలు ఆకాశాన్నంటాయి. లబ్ధిదారునికి యూనిట్‌కు ఇచ్చే రూ. 1.80 లక్షలతోనే నిర్మాణం పూర్తవ్వడం లేదు. కాలనీల్లో చిన్న పాటి ఇల్లు నిర్మించుకోవడానికి కనీసంగా రూ. ఆరు లక్షలు వ్యయం అవుతోంది. దీంతో పేద లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వాయిదా వేస్తున్నారు. అప్పులు పుట్టే పరపతి ఉన్న లబ్ధిదారులు మాత్రమే గృహాలు నిర్మిస్తున్నారు.

మౌలిక వసతుల లేమితో అవస్థలు

జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మిస్తున్న లబ్ధిదారులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇంటి నిర్మాణ సమయంలో క్యూరింగ్‌కు అవసరమైన నీరు కాలనీల్లో అందుబాటులో ఉండటం లేదు. కొన్ని కాలనీల్లో బోర్లు ఏర్పాటు చేసినా నీరు పనిచేయడం లేదు. నిర్మాణాలు మొదలెట్టిన గృహాలకు లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందక అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లోనే అధికారులు, లబ్ధిదారుల వద్దకు వెళ్లి గృహ నిర్మాణాలు మొదలెట్టకుంటే ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు రద్దు చేస్తామని బెదిరించడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు.

గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన

ఖాదర్‌వలి, గృహ నిర్మాణశాఖ డిఇ, నందిగామ

ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొందరు గృహాలు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదు. గృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారులను చైతన్యపరుస్తున్నాం.

నేడు జగ్గయ్యపేటలో టిడిపి పాదయాత్ర

జగ్గయ్యపేట: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకన్న సందర్భంగా, పాదయాత్రకు మద్దతుగా ఈనెల 15వ తేదీన జగ్గయ్యపేటలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు విజయవాడ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు



మాట్లాడుతున్న నెట్టెం రఘురామ్

నెట్టెం రఘురాం, టిడిపి జాతీయ కోశాధికారి రాజగోపాల్ తెలిపారు. విజయవాడ పార్లమెంటరీ అధ్యక్షులు నెట్టెం రఘురాం నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పాదయాత్ర షెడ్యూల్‌ను వివరించారు. శ్రీరాం రాజగోపాల్ నివాసం వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు పాదయాత్ర మొదలై ఎన్టీఆర్ సర్కిల్ , శాంతినగర్ మీదుగా షేర్ మహమ్మద్ పేట నుండి రామచంద్రనిపేట రోడ్డులోని కష్ణుడు గుడి వద్దకు రాత్రి ఏడు గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, కౌన్సిలర్లు కన్నబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వర రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు గుంజ నరసయ్య, మారేపల్లి శౌరి, కొర్రకుటి సైదులు, అడుసుమిల్లి.కష్ణ, రవి, కొఠారి లక్ష్మీనారాయణ, నల్లని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు సత్కారం

జగ్గయ్యపేట: పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో పదవ తరగతి పరీక్షల్లో ఐదు వందల మార్కులు పైబడి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆదివారం రంగస్వామి గుడి సమీపంలో సన్మానించారు. పట్టణంలో విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ లో చదివిన తోకల హర్సితా కి 584 మార్కులు రాగా, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ లో చదివిన కర్నాటి తనూజా కి 521 మార్కులు వచ్చాయి. వీరిని పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు శాలువులతో సన్మానించారు. బహుమతులు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులైన టివియల్ నరసింహారావు, శిరీషా, కర్నాటి కోటేశ్వరరావు, సంధ్యాలను ఈ సందర్భంగా సంఘ ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెనుమల్లి చంద్రమౌళి, కార్యదర్శి భారత జగన్, సంఘ సభ్యులు అల్లి కిశోర్, జల్లా తిరుపతిరావు, మెటికల శ్రీనివాసరావు, యాపిల్ ల్యాబ్ శ్రీనివాసరావు, రచ్చా రామారావు, గోసిక శ్రీనివాసరావు, రచ్చా శ్రీనివాసరావు, జయసుధ, కర్నాటి రాజేశ్వరీ, రోహిణి, బేతు రంగా, సంగెపు రాజశేఖర్, పొట్టాబత్తిన రఘునాథ్, కుక్కడపు సురేష్, సంగెపు నాగేశ్వరరావు, మెటికల సాయి, తుమ్మా ధనుంజయ్, పొట్టాబత్తిన నాగేశ్వరరావు తదితరులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాపీ కార్మికుడు అత్మహత్య

ప్రజాశక్తి-గుడివాడ

పోలీసుల వేధింపులతో గుడివాడలో తాపీ కార్మికుడు ఒర్సు ఏడుకొండలు (44) ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకర్ల వీధిలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు మద్యం సేవించి వాహనం నడుపుతున్న తాపీ కార్మికుడు ఒర్సు ఏడుకొండలును అపి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించినట్లు తెలిపారు. పట్ట పగలు మద్యం సేవించి వాహనం నడుపుతావా అంటూ పోలుసులు మందలించినట్లు తెలిపారు. వాహనం లాక్కొన్న పోలీసులు ఫైన్ కట్టి తీసుకెళ్లమని చెప్పడంతో మనస్థాపానికి గురైన ఏడుకొండలు తన ఇంటి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసునట్లు తెలిపారు. భార్య నర్సాలు ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల చర్యతో ఆత్మహత్య చేసుకున్న ఏడుకొండలు కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

మాంసం, చేపల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశకిత-జగ్గయ్యపేట

మాంసం చేపల విక్రయాల్లో దుకాణ యజమానులు మున్సిపల్ నిబంధనలను పాటించాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ మల్లేశ్వరరావు సూచించారు. శానిటేషన్ బృందాలు పురపాలక సంఘ పట్టణ పరిధిలోని చికెన్, మటన్, చేపల దుకాణములను ఆదివారం ఉదయం తనిఖీ చేశాయి. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ పశు వైద్యుని ఆమోద ముద్ర తీసుకున్న ఆరోగ్యకరమైన జంతువునే మాంసం కోసం వధించాలని, జంతువులను వధించి, మాంసం అమ్మకాలు జరిపే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మున్సిపాల్టీలో అనుమతులు తీసుకున్న దుకాణాల్లో మాత్రమే అమ్మకాలు జరపాలన్నారు. ఇందుకు భిన్నముగా ప్రవర్తించే దుకాణముల యొక్క లైసెన్సులు రద్దు చేస్తామని, దుకాణ యజమానులపై ఆహార భద్రత ప్రమాణాల చట్టం, మున్సిపల్ చట్ట ప్రకారము కఠిన చర్యలకు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

శ్రీ గురుదమ్ ధర్మక్షేత్రంలో శివశ్రీ గెంటేల వెంకటరమణ, వసంత లక్ష్మి గురుదంపతుల ఆధ్వర్యంలో ఆదివారం హనుమజ్జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించి కైలాసగిరి మండలంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. క్రతువులో భాగంగా ఆంజనేయస్వామికి పంచామతాభిషేకం, ఆకు పూజ, విశేష అర్చనలు, హనుమత్ హెూమం, పూర్ణాహుతి, శ్రీరామ పట్టాభిషేకం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. యాత్రీకులకు శ్రీ శివానంద గురు ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ వారు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివశ్రీ రమణ గురుదేవులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి -నందిగామ

నందిగామ మండలంలోని పల్లగిరిగట్టు శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం, , హనుమంతపాలెం కె కండ్రిక, అనాధసాగరం, అడవిరాముడుపాడు ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజలకు అన్నదానం నిర్వహించారు. నందిగామలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో భక్తాంజనేయ స్వామి, రథం బజార్ దాసాంజనేయ స్వామి దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.

నేడు పాదయాత్ర

ప్రజాశక్తి-వన్‌టౌన్

తెలుగుదేశం నాయకులు నారా లోకేష్ యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి కావస్తున్న సందర్భంగా తలపెట్టిన సంఘీభావ యాత్ర జయప్రదం చేయాలని తెలుగుదేశం పశ్చిమ మైనార్టీ నాయకులు ఎంఎస్. బేగ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్ టిడిపి శ్రేణులను, ప్రజలను కోరారు. సోమవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సాయంత్రం 4 గంటల నుండి పాదయాత్ర నిర్వహించబడుతుందన్నారు. కావున ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర అనుబంధం విభాగాల సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు,డివిజన్ అధ్యక్షులు డివిజన్ కార్యదర్శులు కమిటీల సభ్యులు, క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జీలు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

స్వర్గపురిలో పనులు పూర్తి

ప్రజాశక్తి-విజయవాడ

స్వర్గపురిలోని ఎలక్ట్రికల్ విభాగంలోని రేకులు, పెయింటింగ్స్ సీలింగ్ వర్క్స్ చేయించడం జరిగినట్లు స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...స్వర్గపురి ఎలక్ట్రికల్ విభాగంలోని రూ.2.70 లక్షల రేకులు, పెయింటింగ్స్ సీలింగ్ వర్క్ చేసి, ఆఫీసు రూమ్‌ను మరమ్మతు చేయడం జరిగిందని అన్నారు.

నేడు కలెక్టరేట్లో స్పందన

ప్రజాశక్తి-విజయవాడ

జిల్లా కలెక్టరేట్ కార్యాలయ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10: 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ యస్.ఢిల్లీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల ఉన్నతాధికారులు ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ డిల్లీ రావు అన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

నందిగామ : చట్టాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని నందిగామ 16 జిల్లా జడ్జి కోర్టు జడ్జి యెన్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. నందిగామ జిల్లా కోర్టులో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ నందిగామ పట్టణంలో పెండింగ్ లో ఉన్న కేసులు పరిష్కారం కోసం ప్రతి ఒక్కరు కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ సబ్ కోర్ట్ జడ్జి వి లక్ష్మీరాజ్యం, జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి పి తిరుమలరావు, అడిషనల్ జడ్జి , నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండి మల్లికార్జున రావు, పాల్గొన్నారు.

తల్లిని మించిన దైవం లేదు

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రరావు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

స్థానిక అమెరికన్ హాస్పిటల్ ఆవరణలో ఆదివారం మదర్స్ డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత మథర్‌థెరిస్సా విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషములు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవేంద్రరావు ప్రతి ఒక్కరు తల్లిని ప్రేమాభిమానాలతో చూసుకోవాలని, తల్లిని మించిన దైవం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ మరియు మదర్ తెరిసా విగ్రహ వ్యవస్థాపక అధ్యక్షులు, వైశ్యరత్న చారుగుండ్ల వెంకట లక్ష్మీనారాయణ(కొండ) తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

ది. జగ్గయ్యపేట గోపాలకష్ణ విశాల సహకార పరపతి సంఘం నూతన భవన నిర్మాణానికి కెడిసిసి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఆదేశం మేరకు రూ. 2.45 కోట్ల వ్యయంతో ఈ సహకార సంఘ భవనానిన నిర్మిస్తున్నట్లు చెప్పారు. సంఘ భవనంతోపాటు, మల్టీపర్పస్ గోడౌన్ (వాణిజ్య సముదాయం) గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, సొసైటీ అధ్యక్షులు కోలపల్లి వెంకటేశ్వరరావు (బుల్లి బాబు), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ రావు, వార్డు కౌన్సిలర్ పందుల రోశయ్య, వివిధ వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు, సొసైటీ సిబ్బంది, ఃపజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

1508 కేసులు పరిష్కారం

నందిగామ : నందిగామలో జరిగిన లోక్ అదాలత్ లో 1508 సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించి 2 కోట్ల నాలుగు లక్షల 926 రూపాయలు కక్షిదారులకు నష్టపరిహారం అందజేసినట్లు నందిగామ 16 వ అదనపు జిల్లా జడ్జి కోర్టు జడ్జి ఎన్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో నందిగామ సబ్ కోడ్ జడ్జి వి లక్ష్మి రాజ్యం, జూనియర్ కోర్టు జడ్జి పి తిరుమలరావు, అడిషనల్ జడ్జి, నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండి మల్లికార్జునరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం


అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలు జిల్లావ్యాప్తంగా ఆదివారంనాడు ఘనంగా జరిగాయి. పలువురు ప్రముఖులు తమ మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. గుడివాడ : స్థానిక బేతవోలు శాంతి వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధమాతలను ఘనంగా సన్మానించి మాతృదినోత్సవ శుభాకాంక్షలను జనసేన



తోట్లవల్లూరులో



పెదపారుపూడిలో




గుడివాడలో

నాయకుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) తెలిపారు. జనసేన నాయకులు షేక్ మీరాషరీఫ్, నూనె అయ్యప్ప, దివిలి సురేష్, గంటా అంజి, పందిళ్ళ శీను, చరణ్ తేజ, నాగసాయి, కార్తీక్, మంజుల, తదితరులు పాల్గొన్నారు. తోట్లవల్లూరు : మండలంలోని దైవ స్వరూపి ప్రార్థన మందిరంలో పాస్టర్ వల్లూరు సాలోమన్ ఆధ్వర్యంలో ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మాతృమూర్తులను శాలువాలతో, పూల బొకేలతో గౌరవంగా సత్కరించారు. పాస్టర్ సాలోమోన్ సందేశం ఇచ్చారు. **గుడ్లవల్లేరు :** స్థానిక గ్రంథాలయం వద్ద వేసవి విజ్ఞాన శిబిరం లో భాగంగా మదర్స్ డే సందర్భంగా తల్లి విశిష్టతను గుర్చి ఉపాధ్యాయులు టిడి రాజు వివరించారు. ఆడపిల్లలు చదువు ప్రాముఖ్యతను గుర్చి తెలిపారు. పిల్లలతో కథలు, పుస్తకాల చదివించారు. వేసవిలో అనారోగ్యానికి గురి కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ గ్రంధాలయ అధికారిని టి వాణి తదితరులు పాల్గొన్నారు. **పెదపారుపూడి :** మండల కేంద్రమైన పెదపారుపూడిలోని రక్షణ దేవాలయాల్లో మదర్స్ డేను ఘనంగా నిర్వహించారు అనంతరం తల్లులను సన్మానించారు. ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మేజర్ జయప్రద సందేశం ఇచ్చారు. యలమర్రు, వెంట్రప్రగడ, వానపాముల, చినపారుపూడి తదితర గ్రామాలలో మదర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి మేజర్ వాసి బెనర్జీ, వాసే నవ్య, సంఘ పెద్దలు దగాని జోసఫ్, నత్తా భూషణ్ కుమార్, భాస్కరరావు, గుమ్మడి ఏసు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్న దానాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా పలుచోట్ల అన్న దాన కార్యక్రమాలు జరిగాయి. **తోట్లవల్లూరు :** మండలంలోని భద్రిరాజుపాలెం గ్రామంలోని కరకట్ట వద్ద ఉన్న హనుమాన్ దేవాలయంలో అన్నదానం జరిగింది. దాతలు మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధి కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు, మరియు హైదరాబాద్ వాస్తవ్యులు సుధా రెడ్డి, శివకుమార్ దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. **గన్నవరం :** స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుండి భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతి ఈ ర్యాలీని ప్రారంభించారు. శేషకుమార్, పన్యారం విష్ణు మూర్తి, చిమట రవివర్మ,, అరవింద్ పాల్గొన్నారు.మొవ్వ : యద్దనపూడి లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయంతో పాటు పలు హనుమత్ ఆలయాల వద్ద అన్నదానాలు నిర్వహించారు. అవనిగడ్డ : హనుమాన్ శోభాయాత్రను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభించారు. నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్, డిఎస్పి మురళీధర్, సిఐలు శ్రీనివాస్,బి బి రవికుమార్, ఎస్సై జి రమేష్ తదితరులు పాల్గొన్నారు. **పమిడిముక్కల :** పమిడిముక్కల మండలంలోని కపిలేశ్వరపురం శివారు హనుమంతవపురం రోడ్డు దగ్గర ఉన్న హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం జరిగింది. కపిలేశ్వరపురం పాఠశాల ఉపాధ్యాయుడు శ్యామ్‌కుమార్ పర్యవేక్షించారు.



పమిడిముక్కల మండలంలో



తోట్లవల్లూరు మండలంలో

పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి...ఉంగుటూరు (గన్నవరం)

ఉంగుటూరు మండల పరిధిలో గ్రామపంచాయతీలలోని అర్హులైన పింఛను లబ్ధిదారులు ఇంకా మిగిలి ఉంటే ఈనెల 16వ తారీకు లోపు దరఖాస్తు చేసుకొనవలని ఎంపీడీవో శేషగిరిరావు కోరారు. ఆయన ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంబంధిత అధికారులచే వెరిఫికేషన్ పూర్తయిన పెన్షన్ దరఖాస్తులు దారులకు మాత్రమే వచ్చే నెలలో పింఛన్లు మంజూరవుతాయని తెలిపారు. లేకుంటే మరో ఆరు నెలల వరకు పింఛన్లు మంజూరు కావని దరఖాస్తు దారులు గుర్తించాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 16వ తేదీ లోపు అర్హ తలున్న వారు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



అవనిగడ్డలో

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కృష్ణాజిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. విద్యార్థినీ విద్యార్థులు పెద్దఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొని శిక్షణలు పొందుతున్నారు. అవనిగడ్డ : అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పలు అంశాలలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కథలు చెప్పడం, పుస్తక పఠనం, డాన్స్ తెలుగు పద్యాలు, పాటలు పాడడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకురాలు ఎ.వీర కుమారి, ఉపాధ్యాయులు ఎం.శేషగిరిరావు పాల్గొని విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి జె.ప్రభుదాస్, కృపారావు, సిబ్బంది కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. **కలెక్టరేట్ (కృష్ణా) :** సమ్మర్ క్యాంపులో భాగంగా కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ, తృతీయ శ్రేణి శాఖ గ్రంథాలయం చింత గుండు పాలెం వారి ఆధ్వర్యంలో ఆదివారం క్యారంబోర్డు, చెస్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది డి వి నాగరాణి ఎల్ విజయలక్ష్మి, పాఠకులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** చల్లపల్లి శాఖ గ్రంథాలయంలో ఆదివారం జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు స్కిప్పింగ్ ఆటలో మెళకువలను నేర్పారు. విద్యార్థుల్లో పఠనాసక్తి, సృజనాత్మకత పెంపొందించడానికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత మాతృదినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గణేష్ కుమార్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పి.రవి తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో



గన్నవరంలో

గన్నవరం ఎమ్మెల్యే వంశీకి వినతిపత్రం

ప్రజాశక్తి-గన్నవరం

104 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, వాటి పరిష్కారించాలని కోరుతూ గన్నవరం ఎమ్మెల్యే వంశీని కలిసి ఉద్యోగులు ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు మాట్లాడుతూ 104ను ప్రభుత్వమే



వినతిపత్రాన్ని అందజేస్తున్న 104 ఉద్యోగులు

నేరుగా నిర్వహించాలని, ఉద్యోగుల పెండింగ్‌లో వేతనాలు వెంటనే చెల్లించాలని, పిఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని బఫర్ ఉద్యోగులకు బకాయి ట్రావెలింగ్ అలవెన్స్ వెంటనే చెల్లించాలని, బదిలీల సౌకర్యం కల్పించాలని కోరారు. మూడు నెలలకు ఒకసారి ఉద్యోగులు యాజమాన్య ప్రతినిధులతో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మండల కేంద్రాల్లో, నియోజకవర్గాలు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కష్ణ, బి సుబ్బారావు, ఉమా, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రాజ్యాంగ రక్షణ - ప్రజాస్వామ్య పరిరక్షణపై సదస్సు

ప్రజాశక్తి-ఉయ్యూరు

రాజ్యాంగ-ప్రజాస్వామ్య పరిరక్షణపై మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఉయ్యూరులోని వీరమ్మతల్లి గ్రౌండ్‌లో బహిరంగ సదస్సు జరుగుతుందని సామాజిక కార్యకర్త జీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉయ్యూరులో సిపిఎం కార్యాలయంలోఆయన కరపత్రాన్ని విడుదల చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పిసిసి అధ్యక్షులు గిడుగురాజు రుద్రరాజు, బిఎస్పి రాష్ట్ర కార్యదర్శి కె. ప్రసాద్, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ జె విద్యాసాగర్, ప్రజా కవి తంగిరాల సోనీ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.



నందిగామలో న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - నందిగామ

కడప జిల్లాలో న్యాయవాదులపై పోలీసులు దాడిని నిరసిస్తూ నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండి మల్లికార్జున ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆదివారం నిరసన తెలియజేశారు. కడప న్యాయవాది సుబ్రమణ్యం వదల విక్రంపై కడప వన్ టౌన్ పోలీసులు చేసిన దాడికి నిరసనగా బెజవాడ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం నిర్వహించామని మల్లికార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై అక్రమ కేసులు పెట్టి, క్రూరంగా ప్రవర్తించిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి పి ప్రకాష్ , వైస్ ప్రెసిడెంట్ భాస్కరరావు , సీనియర్ న్యాయ వాదులు చావాలి సాంబశివరావు , షేక్ జాఫర్ , ఎక్కిరాల హనుమంతరావు, పాల్ ప్రసాద్ షేక్ ఆజాద్ , కె.పి కష్ణ ప్రసాద్ , గుగులోతు రామారావు, జిల్లేపల్లి చిన్నబాబు, నూతక్కి తారాసింగ్ , తాడేపల్లి కాంతారావు, చావాల దుర్గ , గుమస్తా మాదుగుల నాగరాజు తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజయవాడలో శోభాయాత్ర



ప్రజాశక్తి-విజయవాడ: విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్ విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో శ్రీహనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ ఆదివారం జరిగింది. స్థానిక బిఆర్‌టిఎస్ రోడ్డులోని రామకోటి సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంలోని బిఆర్‌టిఎస్ రోడ్డు, ఫ్లైఓవర్, కుమ్మరపాలెం సెంటర్, ఆర్‌టిసి వర్క్‌షాపురోడ్డు మీదుగా పాల ఫ్యాక్టరీ వద్ద ముగిసింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, సెంట్రల్ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, సత్యనారాయణపురం కార్పొరేటర్ విఎన్‌డిఎస్‌ఎస్ మూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ బ్యాక్ ర్యాలీలో అడుగడుగునా రెచ్చగొట్టే నినాదాలివ్వడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. బిజెపి నాయకులు, స్వామీజీల ప్రసంగాలు వేరే వర్గాలను రెచ్చగొట్టే రీతిలో సాగాయి. లౌకికపార్టీ అని చెప్పుకుంటున్న వైసిపి నేతలు మతోన్మాద విషపు ప్రచారాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ, మతాల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్న విహెచ్‌పి, భజరంగదళ్ లాంటి సంస్థలు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొనడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కాలంలో దేశంలో మరీ ముఖ్యంగా కర్ణాటక ఎన్నికలో సైతం భజరంగదళ్, విహెచ్‌పి లాంటి సంస్థల ద్వారా తన రాజకీయ పబ్బం కోసం బిజెపి విపరీతమైన మతోన్మాద ప్రచారం చేసి, ప్రజల మధ్య చీలిక తేవడానికి చేసిన ప్రయత్నం చివరకు బెడిసికొట్టిన విషయం తెలిసిందే. అంతేగాక ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న భజరంగదళ్‌ను తాము అధికారంలోకి వస్తే బ్యాన్ చేస్తామని చివరికి కర్ణాటక కాంగ్రెస్ ప్రకటించిన విషయం కూడా తెలిసిందే. ఇటువంటి నేపథ్యంలో ఈ రాష్ట్రంలో కూడా మత విద్వేషాలు రెచ్చగొట్టి, రాజకీయంగా లబ్ధిపొందాలని బిజెపి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఆదివారం నగరంలో భజరంగదళ్, విహెచ్‌పి లాంటి సంస్థలు బైక్ ర్యాలీ నిర్వహిస్తే దానిలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే పాల్గొనడం ఏమిటని లౌకిక శక్తులు ప్రశ్నిస్తున్నాయి. అయితే ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, తమ బాధలు, ఇబ్బందులు చెప్పుకోవడానికి ఏదేని చిన్నపాటి నిరసన కార్యక్రమానికి అనుమతిని నిరాకరించే పోలీసు అధికారులు వేరే మతాలను రెచ్చగొట్టే రీతిలో నినాదాలు చేసుకుంటూ, పెద్ద ఎత్తున బైక్‌ల ధ్వని, గాలి కాలుష్యం చేసుకుంటూ సాగిన శోభాయాత్ర కార్యక్రమానికి డిసిపి స్థాయి అధికారి పర్యవేక్షణలో పదుల సంఖ్యలో పోలీసు అధికారులు, వందల సంఖ్యలో పోలీసు సిబ్బంది దగ్గరుండి నిర్వహించడం పట్ల కూడా నగర ప్రజల నుంచి తీవ్రమైన విమర్శలు వినిపిస్తున్నాయి. లౌకిక విలువలు కల్గిన ఈ నగరంలో మత భావాలు వ్యాప్తికి నిర్వహించిన ఇటువంటి కార్యక్రమాలను పోలీసు అధికారులు ఎటువంటి అభ్యంతరం చెప్పకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

దుర్గగుడిలో హనుమజ్జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడిలో ఆదివారం "హనుమజ్జయంతి"ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ అమ్మవారి



ప్రధానాలయం ప్రాంగణం నందు క్షేత్ర పాలకుడిగా ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం నందు, శ్రీ అమ్మవారి పాత మెట్ల వద్ద క్షేత్రపాలకుడిగా ఉన్న ఆంజనేయ స్వామివారి ఆలయం నందు మరియు ఘాట్ రోడ్ నందు ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ఆలయ వైదిక సిబ్బంది మరియు అర్చకులచే స్వామివారికి మూల మంత్ర జపము, హోమం, అభిషేకం, ఆకుపూజ, అర్చన తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం నందు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఆలయ కార్యనిర్వాహనాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, ట్రస్ట్ బోర్డు సభ్యులు బుద్దా రాంబాబు, చింకా శ్రీనివాసులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలపై వైసిపి దాడి దుర్మార్గం : సౌమ్య

ప్రజాశక్తి-నందిగామ: వీరులపాడు మండలం బోడవాడ గ్రామంలో టిడిపి సానుభూతిపరులు లక్ష్మి తిరుపతమ్మ, వారి కుటుంబ సభ్యుల మీద వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం దుర్మార్గమని నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఆదివారం నందిగామ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్తలను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ గర్భవతి అనే మానవత్వం లేకుండా విచక్షణారహితంగా దాడి చేసిన వైసీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో వైసిపి విద్వేషాలు రెచ్చగొట్టి గొడవలు సృష్టించి దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నందిగామ పట్టణ అధ్యక్షులు ఏచూరి రాము నందిగామ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం కొండూరు గ్రామానికి చెందిన రైతు గుంటుపల్లి కిషోర్ బాబు 1 లక్ష రూపాయల విలువ



చేసే గేదె మేత మేస్తూ మేస్తూ ప్రమాదకరంగా ఉన్న కరెంటు ట్రాన్స్ఫార్మర్ తీగ తగిలి ప్రమాదానికి గురై అక్కడకక్కడే మతి చెందింది. ప్రభుత్వం పాడిపశువులకు పశువులు కాసే రైతులకు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప ఏ విధమైన సహకారాలు అందించట్లేదు కరెంట్ తీగలు ప్రమాదకరంగా మారిన ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగింది. పది లీటర్ల పాలు ఇచ్చే గేద ప్రమాదానికి గురి అయ్యి మతి చెందింది . గేదెను కోల్పోయిన రైతు దిగాలుగా ఎదురు చూస్తా ఉన్నాడు. ప్రభుత్వం గానీ విద్యుత్ శాఖ అధికారులు గానీ ఏమైనా ఆర్థిక సహాయం అందిస్తారేమోనని రైతు ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు నందిగామలో పాదయాత్ర

ప్రజాశక్తి-నందిగామ: పట్టణంలోని కాకాని నగర్ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయం నందు ఆదివారం నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావుతో కలిసి తంగిరాల సౌమ్య



సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర ఇప్పుడు ప్రజా గళమైందన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతంగా దూసుకెళ్తోందని, జనవరి 27న మొదలైన పాదయాత్రకు అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో పాదయాత్రకు పోలీసులు, ప్రభుత్వం అనేక అడ్డంకులు సష్టించినప్పటికీ వాటిన్నంటినీ అధిగమిస్తూ లోకేష్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. సోమవారం యువగళం పాదయాత్ర వంద రోజుల మైలురాయిని చేరనున్న సందర్భంగా నందిగామలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట వీరబాబు, వీరంకి వీరస్వామి, కోగంటి బాబు, ఏచూరి రాము, కాసర్ల లక్ష్మీనారాయణ, మన బోతుల శ్రీరామ తదితరులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో 'సూత్రా' ఎగ్జిబిషన్



ప్రజాశక్తి- విజయవాడ అర్బన్: ఈ నెల 17, 18 తేదీలలో బెంజిసర్కిల్ వద్ద గల శేషసాయి కళ్యాణ మండపంలో నందు సూత్రా ఫ్యాషన్ దుస్తుల ప్రదర్శన,అమ్మకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కె.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన ఉదయం 10 నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రవేశం ఉచితమని, సందర్శకులు కొరకు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి సుమారు వెయ్యికిపైగా ప్రదర్శనలు నిర్వహించిన అనుభవం ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో వివిధ రకాల దుస్తులు, డ్రెస్సులు,చీరలు, ఆభరణాలు, గృహోపకరణాలు, బ్యూటీ ఉత్పత్తులు, కాస్మోటిక్స్, గిఫ్ట్ ఆర్టికల్స్ మొదలైనవి ఎన్నో విభిన్నమైన ఉత్పత్తులు ఎగ్జిబిషన్‌లో ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం వివాహ, శుభకార్యాలు సందర్భంగా ప్రతి ఒక్కరికీ నచ్చే విధంగా అన్నిరకాలైన దుస్తులు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక భవానీపురం 45వ డివిజన్లో ఓ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం ఎస్వీ రంగారావు కాపు, తెలగ, బలిజ, ఒంటరి సంక్షేమ సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా పదిలం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా లింగం శివప్రసాద్, ఉపాధ్యక్షులు దారపురెడ్డి ఉదయ్‌భాస్కర్, కోశాధికారిగా జవ్వాజి కొండలరావు, సహాయ కార్యదర్శి జోషి కిరణ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చిరంజీవి, దాసరి రవి, ముత్తా వాసు, పి. సతీష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు సంఘ సభ్యుల ఎదుట ప్రమాణస్వీకారం చేశారు కాపు నాయకులు పిట్టల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కాపు నాయకులు, కార్పొరేటర్లు పాల్గొని ఎస్వీ రంగారావు కాపు, తెలగ, బలిజ, ఒంటటరి సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో కాపు కళ్యాణ మండపం నిర్మాణం చేయాల్సి ఉందని, స్థలం విషయమై స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. రానున్న ఆరు నెలల్లో కళ్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా తెలిపారు.



అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు పదిలం రాజశేఖర్, లింగం శివప్రసాద్ మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి కషి చేస్తామన్నారు. సంఘం యొక్క బలోపేతానికి శాయశక్తుల తోడ్పడుతామని తెలిపారు ఈ సంఘం తరపున రానున్న రోజుల్లో అనేక సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, యలకల చలపతిరావు, మైలవరపు మాధురి లావణ్య, మైలవరపు దుర్గారావు, మైలవరపు కష్ణ, అత్తలూరి పెద్ద బాబు, అమ్మిశెట్టి వాసు, కాపు సంఘం నాయకులు గునుగులా పుల్లయ్య, పత్తి నాగేశ్వరరావు, వడ్లాని మాధవరావు, నవ్యాంధ్ర కాపు సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరావు, వాసా ఆదినారాయణ, సంఘం ఉపాధ్యక్షులు ఉదయ్ భాస్కర్, సహాయ కార్యదర్శి తంగా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వన్‌టౌన్

గుర్తు తెలియని వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందతూ మృతిచెందిన సంఘటనపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ఉండే ఓ వ్యక్తి ఈనెల 8వ తేదీన ఆరోగ్యం బాగోలేదని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళాడు. తన పేరు మాత్రమే దీపక్ అని చెప్పి తనకు ఆరోగ్యం బాగోలేదని జాయిన్ అయి చికిత్స పొందుతూ ఈనెల 13వ తేదీన ఆసుపత్రిలో చనిపోయినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అతని యొక్క పూర్తి వివరాలు ఏమీ తెలియరాలేదని, పేరు మాత్రమే దీపక్ అని ఆసుపత్రిలో చెప్పినట్లు తెలిపారు.ఇతని ఆచూకీ తెలిసిన వారు విజయవాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తెలియపర్చాలని కోరారు. దీపక్ అనే వివరాలు తేలియని వ్యక్తి మృతదేహాన్ని గవర్నమెంట్ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. చనిపోయిన వారి ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ ఫోన్ నెం.9440627076కు గానీ ఏఎస్ఐ జి. శ్రీను ఫోన్ నెం. 7981030190కు తెలియపర్చాలని పోలీసులు కోరారు.

ఎండ తీవ్రతకు అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కంచికచర్ల: మే నెల రెండో వారం చివరిలో భానుడి భగభగకు జనం అల్లాడిపోతున్నారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఎండ తీవ్రత పెరిగింది. నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, విజయవాడ, తిరువూరు తదితర ప్రాంతాల్లో ఎండ తీవ్రత 44 డిగ్రీలు నమోదు అయింది. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోతకు జనం అల్లాడిపోయారు. అప్పటి నుండి ప్రతి గంటకు ఎండ తీవ్రత పెరిగింది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఎండ ఎర్రగా మారి వెచ్చటి వడ వీచింది. ఎండ తీవ్రతకు పగటిపూట జనం బయటకు రావటానికి భయపడ్డారు. దీంతో ప్రధాన నగరాల్లో వీధులు జనం లేక నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం 6 గంటలకు కూడా వేడి తగ్గలేదు. రాత్రి సమయంలో కూడా గాలిలేక వెచ్చగా ఉండటంతో పిల్లలు, వృద్ధులు అల్లాడిపోయారు. ఎండ తీవ్రతకు గ్రామాల్లో శీతల పానీయాలకు గిరాకీ పెరిగింది.

ప్రజాశక్తి-నందిగామ: ఆదివారం ఉదయం 8 గంటల నుండి వేడి వాతావరణం కనబడుతుంది. నందిగామలో 44 డిగ్రీలకు చేరింది. గత నాలుగు రోజుల నుంచి ఎండ విపరీతంగా కాస్తుండడంతో నందిగామ పట్టణం నిర్మానుష్యంగా మారింది. ప్రజలు ఎండకు బయటికి రాలేక ఇంటి లోపలనే ఉంటున్నారు. ఎండ తీవ్రతకు,



ఉక్కపోతకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ వేసవి నుంచి ఉపశమనం పొందాలంటే తగిన జాగ్రత్తలు పాటించాలని నందిగామలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ముండ్ర నరసింహారావు పేర్కొన్నారు. ఈ ఎండల వల్ల తలనొప్పి, ఒళ్ళు మంట, డీహైడ్రేషన్ లాంటి సమస్యలు వెంటాడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

సృజనాత్మక విద్యకు చిరునామా 'వివిఎస్ సెయింట్ జాన్స్'

ప్రజాశక్తి-గన్నవరం

విద్యార్థుల్లో నిబిడీకృతమైన సృజనాత్మకత శక్తులను వెలికితీయటంతో ద్వారా వారిలో ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ సాధించేలా నిరంతరం కృషిచేస్తున్న విద్యాసంస్థల్లో గన్నవరం 'వివిఎస్ సెయింట్ జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాల' ఒకటని చెప్పొచ్చు.

విజ్ఞానం అందించే పాఠాలూ..జ్ఞానాన్ని పెంపొందించే అనుభవాలూ.. నీతి కథలూ..ఆరోగ్య సూత్రాలు..ప్రకృతి ఆరాధనలూ...మొక్కల



వేడుకల్లో పాల్గొన్న హోం మంత్రి తానేటి వనిత,ఎమ్మెల్యే వంశీ



పాఠశాల ఎనసిసి కేడెట్లతో ప్రినిపల్ సంతోష్‌కుమార్

పెంపకాలు...నీటి పొదుపులూ, డిజిటల్ క్లాసులూ, సైన్స్ ల్యాబులూ. ..గ్రంథాలయాలూ... క్రీడామైదానాలు...విజ్ఞాన విహార యాత్రలు చేయిస్తూ..సాహిత్య, శాస్త్రీయ సంగీత, నృత్య, వాయిద్యాలందు శిక్షణతో పాటు..కంప్యూటర్ విద్యను బోధిస్తుండటం ఇక్కడ ప్రత్యేక విద్యార్థుల్లో సంపూర్ణమూర్తిమత్వాభివృద్ధిని పెంపొందిస్తూ సమాజానికి మంచి పౌరులను అందించే కార్యశాలగా గన్నవరం వివిఎస్ సెయింట్ జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాల సాగుతోందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. మారుతున్న సమాజంలో అధునాతన డిజిటల్ టెక్నాలజీని సైతం అందిపుచ్చుకునేలా ఇక్కడి విద్యార్థులకు బోధన జరుగుతోందని ఉపాధ్యాయులు, విద్యార్థులు పేర్కొంటున్నారు. సెయింట్ జాన్స్ బాలుర హోమ్ మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో కన్పిస్తుందనీ, ఈ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌళిక వసతులు అందుబాటులో ఉంటాయని పేర్కొంటున్నారు. 1969లో ప్రారంభించబడి నాటి నుండి నేటి వరకు పాఠ్య, పాఠ్యేతరాంశాలతోపాటు సృజనాత్మక, పరిశీలనాత్మక, క్రీడా పద్ధతుల్లో బోధన జరుగుతోంది. 3500 పైగా విద్యార్థులుండే ఈ పాఠశాలలో ఎన్ఇపి నియమ నిబంధనలను అనుసరించి నర్సరీ నుండి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన ఉన్నత విద్యా బోధనతో పాటు క్రీడా, సాహిత్య, సామాజిక విషయాలను విద్యార్థులకు అందిస్తోంది. ఉపాధ్యాయులు అదనపు సమయాన్ని కేటాయిస్తూ విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. పోటీ పరీక్షల వల్ల కలిగే విజ్ఞానం, ప్రయోజనాలే కాకుండా ప్రస్తుతం సామాజిక బాధ్యత, మహిళా విద్య, కోవిడ్ వంటి సామాజిక అంశాల పట్ల చక్కటి అవగాహన



కల్పిస్తున్నారు ప్రస్తుత పాఠశాల ప్రిన్సిపాల్ రెవ.బ్రదర్. సంతోష్ కుమార్. రెవ.బ్రదర్. జూలియన్ సారధ్యంలో పూరిపాకలో స్థాపించబడి 'ఇంతింతై వటుడింతై' అన్న చందాన నేడు అత్యాధునిక పక్కా భవనాలతో 30 ఎకరాల క్రీడామైదానాలతో, పచ్చని ప్రకృతి రమణీయకతను అందిపుచ్చుకుంది. అన్ని రకాల ఆధునిక హంగులను సమకూర్చుకుని ఎలాంటి పోటీ ప్రపంచంలోనైనా మేము ఎందులోను వెనకడుగు వేయబోమంటూ దృశ్య, శ్రవణ మాధ్యమాలు తరగతి గదిలోకి తీసుకొచ్చి ప్రతి విద్యార్థి ఆన్‌లైన్ పోటీ పరీక్షలు ఎదుర్కొనే విధంగా తర్ఫీదునిస్తూ, ఆంగ్లభాషాభివృద్ధితో పాటు భావాత్మక నైపుణ్యాలను మరింత పటిష్ఠపరుస్తూ సాహిత్య, సాంస్కృతిక, సామాజికాంశాలతో పాటు సేవా దృక్పథాన్ని అలవరుస్తోంది వివిఎస్ సెయింట్ జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాల.



రెవ.బ్రదర్.జిమ్మికురియోకోస్ శిక్షణలో రాటుదేలి రాష్ట్ర, జాతీయ క్విజ్ పోటీల్లో పలువురు విద్యార్థులు పాల్గొని అనేక బహుమతులు పొందుతున్నారు.

సిబిఎస్ఇ, ఇంటర్ ఫలితాల్లో వివిఎస్ సెయింట్ జాన్స్‌కు రికార్డు ఫలితాలు

గన్నవరంలోని వివిఎస్ సెయింట్ జాన్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్ తెలిపారు. పదో తరగతి విద్యార్థిని జి.రెబేక 486/500 మార్కులతో పాఠశాల మొదటి స్థానంలో, ఆముదాల భార్గవ్ 486 మార్కులతో ద్వితీయ, కె.స్టీఫెన్ పాల్ గణితంలో 100/100 మార్కులు సాధించాడన్నారు. ప్లస్ టు విద్యార్థులు 480/500 మార్కులతో ఎన్. హీరారేష్మి మొదటి స్థానం, 470/500 మార్కులతో వి.హృదయాక్షిత రెండోస్థానంలో నిలిచారని చెప్పారు. గేయం రుగ్వేద సాయి శ్రీనివాసరెడ్డి 466 మార్కులతో తృతీయ, పామర్తి సునంద 462 మార్కులతో నాలుగోస్థానంలో, చిన్నం అశోక్ చక్రవర్తి 461 మార్కులతో ఐదో స్థానంలో నిలిచారన్నారు. 450 నుంచి 480 మార్కులు ఐదుగురికి, 400 నుంచి 449 మార్కులు 16 మందికి, 350 నుంచి 399 మార్కులు 23 మందికి, 300 నుంచి 349 మార్కులు తొమ్మిదిమందికి వచ్చాయన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను రెవ.బ్రదర్ జిమ్మీ కురియోకోస్, రెవ.బ్రదర్. బి.జోసఫ్, ఉపాధ్యాయులు అభినందించారు. ఇంటర్మీడియట్‌లో 53 విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

కొండాలమ్మ ఆలయానికి యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి, గుడ్లవల్లేరు

మండలంలోని వేమవరం గ్రామంలోని శ్రీ కొండాలమ్మ అమ్మవారి ఆలయాన్ని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రీకులు సందర్శించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. 20 వేల మంది అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి మొక్కుబడులను తీర్చుకున్నట్లు చెప్పారు. ఆలయానికి విచ్చేసిన యాత్రికులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం గోపి, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లు పరిశీలించారు. కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం దత్తత దేవస్థానమైన రెడ్డిపాలెం గ్రామంలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం, నాగవల్లి తలార్చన, స్వామి వారికి శాంతి కల్యాణం, వీరాంజన మంత్రపుష్పం, గ్రాయోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలలో పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న యాత్రికులు

విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహించాలి

ప్రజాశక్తి చల్లపల్లి

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని పిఆర్‌టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. చల్లపల్లి మండలం కొత్త మాజేరు గ్రామంలో పది,ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు తెనాలి జెస్సికా(574/600), ముదునూరి సహస్ర(475/500), అవనిగడ్డ శ్రీకష్ణప్రియ (463/470),



విద్యార్థులను అభినందిస్తున్న దేవరపల్లి సురేష్‌బాబు

ఎం.సోను(446/500)లకు పంచాయతీ కార్యాలయంలో పౌర సన్మానం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేలా వారికి ఉన్నత చదువుల పట్ల అవగాహన కల్పించేలా గ్రామ సచివాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వమే అధికారికంగా విద్యార్థులకు అభినందన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు సర్పంచ్ భర్త కళ్లెపల్లి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ సభ్యులు తమ్ము మనోజ్, మద్దాల వెంకటేశ్వరరావు, పవన్,విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెనిగండ్ల ఫౌండేషన్ అన్నసమారాధన

ప్రజాశక్తి, గుడ్లవల్లేరు

హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయస్వామివారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడ్లవల్లేరు వార్పు రోడ్డులోని ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద జరిగిన హనుమాన్ జయంతి కార్యక్రమం సందర్భంగా వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 400 మందికి అన్న సమారాధన కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు వెనిగండ్ల రాము ఏర్పాటు చేశారు. వెనిగండ్ల పౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిసుతన్నామని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకట సుబ్బారావు, ఈడుపుగంటి ఉమామహేశ్వరరావు, మురాల సుబ్రహ్మణ్యేశ్వర రావు పాల్గొన్నారు. అలాగే చేపల మార్కెట్ వీరాంజనేయ యూత్ మరియు భక్త బందం ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వైసిపి ప్రభుత్వాన్ని ఎండగట్టాలి : వర్ల

ప్రజాశక్తి-పెదపారుపూడి

ప్రజా వ్యతిరేక విధానాలతో భారాలు మోపుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని పామర్రు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వర్ల కుమార్ రాజా




ప్లకార్డులను ప్రదర్శిస్తున్న వర్ల కుమార్‌రాజా తదితరులు

విమర్శించారు. పెదపారుపూడి మండలం వానపాముల గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అత్యంత అప్రజాస్వామికంగా పరిపాలన సాగిస్తోందన్నారు. ప్రజా సమస్యలగురించి ఏమాత్రం పట్టించుకోవటం లేదన్నారు. పౌర సేవలు ప్రజలకు అందే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, మండల టిడిపి కార్యదర్శి మసిముక్కు రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు వేములపల్లి నరసింహారావు, మెండ దాసు, కె.లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

సమాజ సేవకు ప్రాధాన్యత ఇవ్వాలి

గన్నవరం : మండలంలోని గోపవరపు గూడెం గ్రామంలో గొట్టుముక్కల వంశీయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. అందరూ తమ యోగక్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఇంతకాలం తర్వాత మాతృభూమిపై ఒక్కసారిగా కలవడంతో ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. 50 ఏళ్లకు పైబడిన తరువాత ఈ గ్రామంలో ఈ విధంగా ఒకచోట కలవడంపై పెద్దలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఒకరి బిడ్డలను మరొకరు పలకరించుకుంటూ ఆప్యాయంగా దీవించారు. ఈ సందర్భంగా పెళ్లి రోజులు జరుపుకున్న వారిని వేదికపైకి పిలిచి సత్కరించారు. ఆడపడుచులందరికీ వేదికపై పసుపు కుంకుమలు అందజేశారు. పలువురు పెద్దలు మాట్లాడుతూ సమాజ సేవకు అందరం తమ తమ వంతుగా కృషి చేద్దామని ప్రతిజ్ఞచేశారు. ఒరిస్సా, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌తోపాటుగా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి గోపవరపు గూడెం గ్రామానికి చెందిన గొట్టుముక్కల వంశస్థులు కుటుంబాలతో సహా తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాతృభూమికి సేవ చేసేందుకు తమ వంతుగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పలువురు చిన్నారులు సినీ గీతాలకు లయబద్ధంగా డ్యాన్సులు చేశారు. పెద్దలు పాటలు పాడి అలరించారు. గొట్టుముక్కల వంశస్తుర ఆత్మీయ కలయిక ఆద్యంతం ఆనందంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ముఖ్యులతోపాటు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వంశీయులు

పాదచారులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

హనుమాన్ జంక్షన్ బస్టాండ్ ఎదురుగా నున్న సత్యనారాయణ స్వీట్స్ అండ్ హోమ్ ఫుడ్స్ వద్ద యాత్రికులు, పాదచారులకు ఉచితంగా ఆదివారం మజ్జిగను నిర్వాహకులు పంపిణీ చేశారు. విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు శిబిరాన్ని ప్రారంభించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా యాత్రికులకు మజ్జిగ, చల్లని మంచినీరు ఏర్పాటు చేసిన యనమదల రమేష్ అభినందనీయుడని చలసాని ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నుబోయిన శివయ్య, యనమదల రమేష్, రాపర్ల శ్యామ్ సుందర్, కన్నికంటి నాగ మునీంద్రరావు ,పర్వతనేని దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

అద్దె షాపుల్లో అవినీతి బేరం

అధికారి బదిలీ అవ్వడం చర్చనీయాంశమైంది. ఆ తర్వాత ఈ నోటీసులు అమలు చేయాలని స్థానికులు మండల పరిషత్ అధికారులకు, అప్పటి జెడ్పీ ఇన్‌ఛార్జి సిఇఒవోకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించలేదు. హైకోర్టు ఇచ్చిన గడువు ముగిసినా దుకాణాలకు వేలం నిర్వహించకుండా నామమాత్రంగా అద్దె పెంచి ప్రస్తుత నిర్వాహకులకే తిరిగి దుకాణాలు కేటాయించేందుకు తెరచాటు ఒప్పందాలకు జరిగినట్లు తెలుస్తోంది.

చేతులు మారిన నగదు ?

తిరిగి ప్రస్తుత నిర్వాహకులకే కాంప్లెక్స్‌లో దుకాణాలను కేటాయించేందుకు నియోజకవర్గస్థాయి నేత ఒకరు చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. తన వాటాగా రూ.10 లక్షలు తీసుకుని ప్రస్తుత దుకాణ నిర్వహకులకు భరోసా ఇచ్చారని, ఈక్రమంలోనే వేలం నిర్వహించకుండా చక్రం తిప్పుతున్నారనే చర్చ జరుగుతోంది.

రూ.316 కోట్లతో రక్షిత మంచినీటి పథకాలు

వెంటనే స్కీమ్స్‌ను పూర్తి చేస్తాం.

ప్రశ్న: విజయవాడలోని స్ట్రామ్ వాటర్ డ్రైనేజి స్కీమ్ పరిస్థితి ఏ దశలో ఉంది?

జ : ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారం అంతా రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనే ఉంది. గత రెండు సంవత్సరాలకు ముందు వరకూ కూడా ఈ స్కీమ్‌ను తమ శాఖ పర్యవేక్షణలోనే 'మెగా ఇంజినీరింగ్' సంస్థ చేపట్టి దాదాపుగా 50 శాతానికిపైగా పనులు పూర్తి చేయడం జరిగింది. ఆ తరువాత ఎదురైన కొన్ని ప్రత్యేక పరిస్థితులు, వర్క్‌లో స్తబ్దత రీత్యా విఎంసికి ఈ స్కీమ్స్‌ను అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్ణయాధికారం అంతా ప్రభుత్వం వద్దే ఉంది. విఎంసి టేకప్ చేయాల్సి ఉంది. నగరానికి ఇది ఎంతో ముఖ్యమైన స్కీమ్. గతం నుంచి నడుస్తున్న స్కీమ్స్ దెబ్బతినిపోవడం, అంతేగాక కొన్ని మునిసిపాలిటీల్లో అసలు స్కీమ్స్ లేకపోవడం, ప్రధానంగా భూగర్భ నీటి మట్టాలు క్రమంగా అడుగంటిపోవడం, ఆయా మునిసిపాలిటీల్లో కలుషితమవుతుండటం, మరొక ముఖ్యకారణంగా ఆయా మునిసిపాలిటీల్లో ఫ్లోరిన్ శాతం పెరిగిపోవడం, తాగడానికి వీలు లేకుండా పోవడం తదితర కారణాల రీత్యా రక్షిత మంచినీటి స్కీమ్స్ ఆవశ్యకత పెరిగిపోయింది. తక్షణం నిధుల లభ్యత ఆధారంగా ఈ స్కీమ్స్‌ను ప్రారంభించి, పూర్తి చేయడానికి తమ శాఖ తరుపున చర్యలు తీసుకుంటున్నాం.

కమ్యూనిస్టుల పునరేకీకరణ అవసరం

ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ నగర సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్క వీరభద్రరావు, సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, సిపిఐ ఎంఎల్ నాయకులు ఖాదర్ బాషా, సిపిఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడయ్య తదితరులు పాల్గొన్నారు.

19న సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలు

సంకేతాలను కర్ణాటక ఫలితాలు వెల్లడిస్తున్నాయన్నారు. కర్ణాటకలో బిజెపి ప్రభుత్వాన్ని కాపాడలేని మోడీ, ఆంధ్రప్రదేశ్లో తమను, తమ పార్టీలను కాపాడతారని వైసిపి, టిడిపి, జనసేన నేతలు భ్రమ పడుతున్నారన్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరమైనా ఈ పార్టీలు పునరాలోచన చేయాలని, ఎన్నికల్లో పొత్తుల పెట్టుకుంటామంటూ నేతలు చేస్తున్న ప్రకటనలు ఆత్మహత్యా సదృశ్యమని గమనించాలని అన్నారు. దేశంలో ఉన్మాద ఎజెండాను ఎదుర్కొని దేశ ఐక్యతను కాపాడుకోవాలని, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు బి.రమణరావు, కె.దుర్గారావు, టి.ప్రవీణ్, సిహెచ్.శ్రీనివాస్, పి.కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు విద్య, ఉపాధి అవకాశాలే లక్ష్యం

మిల్లీ కౌన్సిల్ సమావేశంలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ

ఆర్థికంగా వెనుకబడిన పేద ముస్లిం విద్యార్థులకు విద్యాభ్యాసం అందించడంతో పాటు, వారి అభివృద్ధికి కృషి చేసే విధంగా మిల్లీ కౌన్సిల్ కృషి చేస్తుందని ఆలిండియామిల్లీ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యనిర్వాహకులు మౌలానా ముస్తాఫా రిఫాయి తెలిపారు. లబ్బీపేటలోని ఆల్ మునీర్ ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం సంస్థ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మౌలానా ముస్తఫారిఫాయి మాట్లాడుతూ విద్యాభివృద్ధిపై సామాజిక అభివృద్ధి ఆధారపడి ఉందని అందుతే తాము విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. దేశ జనాభాలో సుమారు 30 కోట్ల మందిముస్లింలు నివసిస్తున్నారని వీరిలో నేటికీ 60 శాతం మంది దారిద్ర్యరేఖదిగువన దుర్భరమైనజీవితం గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు ముస్లింలలో సుమారు 43 శాతం నిరక్షరాస్యత ఉందని, అన్నారు.ధార్మిక విద్యను కాపాడుతూ ఆధునిక విద్యా బోధనవైపు అడుగులు వేసే విధంగా తమ సంస్థ కృషిచేస్తుందన్నారు. 2050 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ప్రదాన ఉద్దేశంగాఆలిండియా మిల్లీ కౌన్సిల్ లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. జాతీయ ఉప కార్యదర్శి సులేమాన్‌ఖాన్ మాట్లాడుతూ నేడు దేశానికి హిందూ ముస్లిం మధ్య ఐక్యత సోదరభావాన్ని పెంపొందించడం కోసం కృషి చేయాలన్నారు. భావితరాల యువతకుఉత్తమ భవిష్యత్తు అందించడంతో పాటు కుల, మత, వర్గ వివక్షను దూరం చేయాల్సిన బాద్యత ఈమేధావులపై ఉందన్నారు. మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర



ప్రదానకార్యదర్శి షేక్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ ముస్లిం సమాజం అభివృద్ధి సాధించాలంటే ముందుగా ఆర్థిక అసమానతలు అధిగమించాలన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడం, డ్రాప్ఔట్స్ తగ్గించడం, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థికంగా చేయూత అందించి విద్యా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.



ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయవాడ: కృష్ణలంక 22వ డివిజన్‌లోని ఎస్‌వి రెడ్డి మునిసిపల్ స్కూల్‌లో దేవినేని నెహ్రూ చారిటిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వర హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిభిరం జరిగింది. ఈ శిభిరాన్ని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...దేవినేని నెహ్రూ చారిటిబుల్ ట్రస్ట్ తరుపున ఈ ఉచిత వైద్యశిభిరం నిర్వహించి పలువురికి వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా రానున్న కాలంలో మరిన్ని సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు,వైసిపి ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ,ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగ అధ్యక్షులు కొరివి చైతన్య,స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి,ఎన్టీఆర్ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు చిమాటా సాంబశివరావు,డివిజన్ అధ్యక్షులు జోగా రాజు తదితరులు పాల్గొన్నారు.



చంద్ర శ్రీమన్నారాయణ వర్ధంతి

ప్రజాశక్తి-నందిగామ: రైతు కూలీ సంఘం నాయకుడు చంద్ర శ్రీమన్నారాయణ 15వ వర్ధంతి కమ్మవారిపాలెం గ్రామంలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అమరస్థూపం వద్ద ఎర్రజెండాను రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రామావత్ కోట్యా నాయక్ ఎగురవేసి నివాళులర్పించారు. శ్రీమన్నారాయణ చిత్రపటానికి చంద్ర వెంకటరమణ, సీతారామయ్య, సత్యనారాయణ, చంద్ర జనార్థనరావు, గ్రామ సర్పంచ్ పి.నిర్మల పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ, కంచికచర్ల, అంబారుపేట మరియు కోనాయపాలెం గ్రామాల నుండి ఆదివారం సాయంత్రం వచ్చిన భారీ ఆహారం డివిఆర్ కాలనీ, గుజ్జాల పేట, జంగాల కాలనీ మరియు ఉమా కాలనీ పేదలు సుమారు 500 మందికి పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు పారేపల్లి సాయిబాబు, ఉడతా శ్రీను, పల్లెలపాటి కొండ, జెమిలి మల్లేష్, చవట కృష్ణ, పాదర్తి రాఘవ, శ్రీ రామ్ తదితరులు పాల్గొన్నారు.



జగన్‌కు పిచ్చి పరాకాష్టకు చేరింది : బుద్దా

ప్రజాశక్తి-వన్‌టౌన్: ముఖ్యమంత్రి జగన్‌కు పిచ్చి పరాకష్టకు చేరిందని టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఘాటుగా విమర్శించారు. ఆదివారం వన్‌టౌన్‌లోని బుద్ధా వెంకన్న తన కార్యాలయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం జగన్‌కు పిచ్చి పరాకాష్టకు చేరిందంటూ మండిపడ్డారు. చంద్రబాబు కరకట్టపై అద్దెకు ఉన్నారని ఆ ఇల్లు లింగమనేనిదని అన్నారు. అవినాష్ రెడ్డి అరెస్ట్‌ను పక్కదారి పట్టించేందుకు ప్రజల మైండ్ సెట్ ను డైవర్ట్ చేయడానికే చంద్రబాబు అద్దెకు ఉంటున్న ఇంటికి నోటీసులు ఇచ్చారని విమర్శించారు. కరకట్టపై చంద్రబాబు అద్దెకు ఉంటున్న ఇంటికి నోటీసులు ఇచ్చి చంద్రబాబు ఇంటికి నోటీసులు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సిఐడి అంటే చెత్తబుట్ట మాదిరి తయారైందన్నారు. జగన్ ఫ్రస్టేషన్‌లో ఉన్నాడని, లోకేష్ పాదయాత్ర 100 రోజులవుతుందని జగన్‌లో టెన్షన్ మొదలైందన్నారు. చంద్రబాబు ఉంటానంటే నాతో పాటు వందలాది మంది ఇళ్లు ఇస్తారని చెప్పారు. పవన్‌కల్యాణ్ స్టేట్ మెంట్‌తో జగన్‌కు ఇంకా పిచ్చి ముదిరిపోయిందని, టిడిపి, జనసేన కలిస్తే ప్రజలు ఎపి నుంచి తరిమికొడతారని జగన్ కు అర్థమయ్యే ఇటువంటి చేష్టలకు దిగుతున్నారన్నారని వెంకన్న విమర్శించారు.

పవన్‌కల్యాణ్‌పై విమర్శలు మానుకోవాలి

ప్రజాశక్తి-భవానీపురం: కాపులకు అన్యాయం చేశారని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై వైసిపి పార్టీలోకి కొందరు కాపు నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని అవి మానుకోవాలని 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష తెలిపారు. ఆదివారం భవానీపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తిరుపతి అనూష మాట్లాడుతూ కాపులకి అన్యాయం చేశారంటూ పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేసే వైఎస్ఆర్సిపి కాపు నాయకులు అందరికీ ఒకటే ఛాలెంజ్ చేస్తున్నా మీలో ఎవరినైనా సరే ముఖ్య మంత్రి అభ్యర్థిగా మీ నాయకుడు ప్రకటించగలరా అని వైఎస్ఆర్సిపి కాపు నాయకులకి జనసేన పార్టీ మహిళా నాయకురాలు, 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష బహిరంగ సవాల్ చేశారు. లేదంటే మీరంతా మూకుమ్మడిగా రాజీనామా చేసి జనసేన పార్టీలో జాయిన్ అవుతారాని అన్నారు. అదేవిధంగా టిడిపి, బిజెపి పార్టీలో ఉన్న కాపులు అందరు కూడా రాజీనామా చేసి జనసేనలోకి రావాలని హితవు పలికారు. పవన్ కళ్యాణ్ నిలబెట్టిన వ్యక్తులందరికి మీరందరూ అండగా నిలబడి ఏ స్వార్థం లేకుండా ఏమి ఆశించకుండా వాళ్ళని గెలిపించి, అప్పుడు పవన్ కళ్యాణ్‌కి ఉచిత సలహాలు ఇవ్వాలని ఆమె కోరారు. కులాన్ని అడ్డం పెట్టుకుని పదవిని పొందిన మీరందరూ కూడా



పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడమంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు అవుతుందన్నారు. 2014లో ఏ పదవి ఆశించకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజానీకాభివద్ధి కోసం పవన్ కళ్యాణ్ బిజెపి, టిడిపికి మద్దతు పలికారని తెలిపారు. అయ్యా కాపు కార్పొరేషన్ చైర్మన్ మీ నాయకుడు జగన్ సంవత్సరానికి రెండు వేల కోట్లు రూపాయలు ఇస్తానంటున్నారు, కాపు కార్పొరేషన్‌కి ఎన్ని వేల కోట్లు ఇచ్చారోచెప్పాలన్నారు. అనవసరంగా పవన్ కళ్యాణ్‌పై విమర్శలు మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పసుపులేటి నాగకష్ణ, అద్దంకి బాలసుబ్రమణ్యం, సుధా బత్తుల సూరిబాబు, మల్లెముడి మహేశ్వరి పాల్గొన్నారు.

నేడు భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-గన్నవరం

భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించి, పెండింగ్ క్లైములు వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బడుగు మరియదాసు, సిఐటియు మండల నాయకులు శ్రీనివాసరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15న జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులు రూ. 1600 కోట్లను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు మళ్లించి కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ళ కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 32 వేల క్లైయిములు పెడింగ్‌లో పెట్టడం శోచనీయమన్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన ఇసుక పాలసీతో ఇసుక అందుబాటులోలేక నిర్మాణాలు సాగక రాష్ట్రంలో 32 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇనుము, ఇసుక, కంకర ధరలు పెరగడంతో భవన నిర్మాణాలు తగ్గిపోయాయని, కార్మికులు పనిలేక పస్తులుండాల్సి వస్తోందన్నారు. ఈ సమావేశంలో సుందరరావు పాల్గొన్నారు.

కవుతరంలో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ నందు ఆదివారం కేపీఎల్ సెషన్స్3 క్రికెట్


ప్రారంభిస్తున్న మత్తి రమేష్

టోర్నమెంట్ మత్తి అన్వేష్ చంద్ర జ్ఞాపకార్ధం వారి తండ్రి అయినా మత్తి రమేష్ చేతుల మీదగా ప్రారంభించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 63 జట్టులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు ఈ పోటీలలో ప్రథమ బహుమతి సాధించినవారికి రూ.30వేలు ద్వితీయ బహుమతి సాధించినవారికి రూ. 20వేలు అందించనున్నట్లు ప్రకటించారు. క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు స్వామి, మోహన్, మదన్, శ్రీకాంత్ పోటీలను పర్యవేక్షిస్తున్నారు.

80 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

స్థానిక లయన్స్ సేవా భవనంలో ఆదివారం ఉచిత మధుమేహ వ్యాధి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. డాక్టర్ రజిని 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్ వై పి సి ప్రసాద్, సిహెచ్ రాజా, సిహెచ్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతిపై కేసు నమోదు

ప్రజాశక్తి - మొవ్వ

బీమనది చానల్ డ్రైయిన్‌లో మునిగి వృద్ధురాలు మతి చెందిన ఘటనపై కూచిపూడి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. మొవ్వ మండలం కాజా గ్రామానికి చెందిన మాచర్ల లక్ష్మీకాంతం (66) ఆదివారం డ్రెయిన్‌లో శవమై కన్పించటంతో పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆమెకు వివాహమైన సంవత్సరానికే మనస్పర్థలు కారణంగా భర్తను వదిలి స్వగ్రామమైన కాజలోనే సుమారు 45 సంవత్సరాల నుంచి ఒంటరిగా ఉంటోంది. ఆమెకు సంతానం లేదు. సుమారు ఐదు నెలల నుండి తన ఆరోగ్యం సరిగా లేకపోవడం, మతిస్థిమితం కూడా సరిగ్గా లేక పోవడంతో ఆమె తమ్ముడు వెంకటేశ్వరరావు బందరులో వైద్యం చేయించుచున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో ఇంటి నుండి లక్ష్మీకాంతం బయటకు వెళ్లినట్లు ఆ తర్వాత మధ్యాహ్నం సుమారు ఒంటిగంట సమయంలో మతురాలు కాజా గ్రామంలోని భీమనదీ ఛానల్ డ్రైన్ లో చనిపోయి ఉన్నట్లుగా సమాచారం అందటంతో వెళ్లి చూడగా తన అక్క లక్ష్మీకాంతం చనిపోయి ఉన్నట్లు గుర్తించామని వెంకటేశ్వరరావు తెలిపారు. కూచిపూడి పోలీస్ స్టేషన్ లో చేసిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. కూచిపూడి ఎస్ఐ డి.సందీప్ తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గన్నవరం-ఉంగుటూరు రూట్లో ఆర్టీసీ సర్వీసులు బంద్

నిరుపయోగంగా మారిన ఉంగుటూరు బస్టాండ్ ...ప్రయాణీకులకు అవస్థలు

ప్రజాశక్తి-ఉంగుటూరు

గన్నవరం-ఉంగుటూరు రూట్లో ఆర్టీసీ సర్వీసులను తగ్గించి వేశారు. దీంతో ఈ రూట్‌లోని బస్సు సర్వీసులు సకాలంలో అందుబాటులోకి రాక ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గన్నవరం



వయా ఉంగుటూరు - గుడివాడ మీదుగా జిల్లా కేంద్రం మచిలీపట్నానికి గన్నవరం డిపో నుంచి నిర్వహించిన బస్సు సర్వీసులు ప్రయాణీకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేవి. గన్నవరం, ఉంగుటూరు మండలాల నుంచి జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలకు రాకపోకలు సాగించే ఉద్యోగులకు, సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్, ఎస్పీ, రెవెన్యూ, జిల్లా పరిషత్తు, విద్యాశాఖ జిల్లా కార్యాలయానికి వెళ్లడానికి, గుడివాడ, గుడ్లవల్లేరు, మచిలీపట్నంలోని ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కళాశాలలు, స్కూల్స్‌కు వెళ్ళే విద్యార్థులు ఆర్టీసీ సర్వీసులను ఉపయోగించుకునేవారు. అదివారం, గురువారం వేమవరం కొండాలమ్మగుడికి, కార్తీకమాసంలో మచిలీపట్నం సముద్రస్నాలకు వెళ్ళడానికి ఈ సర్వీసులను వినియోగించేవారు. ఈ క్రమంలోనే ఉంగుటూరు బస్టాండ్ నిత్యం ప్రయాణీకులతో నిండు కుండలా ఉండేది . బస్సు సర్వీసులు నిలిపివేయడంతో ఉంగుటూరు బస్టాండ్ ప్రయాణీకులు లేక వెలవెలపోతోంది. పట్టించుకునేవారు లేక చెత్తా చెదారంతో నిండిపోయింది. సంచార జీవులకు నిలయంగా మారింది. ఆర్టీసీ సర్వీసులు తగ్గించటంతో సంస్థకు రావాల్సిన అదాయం ప్రైవేటు వాహనాలకు వెళ్లిపోతుంది. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ స్వగ్రామం ఉంగుటూరు వైపుగా బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేని, ఆర్టీసీ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

గుండెపోటుతో సిఐఎస్ఎఫ్ ఉద్యోగి మృతి

అవనిగడ్డ : శంషాబాద్ ఎయిర్పోర్ట్‌లో సిఐఎస్ఎఫ్ బెటాలియన్లు విధులు నిర్వహిస్తున్న అవనిగడ్డ మండలం అశ్వరావు పాలెం గ్రామానికి చెందిన విశ్వనాథుని యువ కిషోర్(36) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఆదివారం అశ్వరావు పాలెం గ్రామంలోని తన ఇంటి వద్ద సెలవు నిమిత్తం వచ్చిన యువ కిషోర్ మెట్లు ఎక్కుతుండగా గుండెపోటు రావడంతో మెట్ల మీద నుంచి కిందికి పడిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తోటి సిబ్బంది తెలిపారు. సోమవారం అసురపాలెం గ్రామంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సిఐఎస్ఎఫ్ బెటాలియన్ అధికారులు తెలిపారు. యువకిశోర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యువ కిశోర్ ఆకస్మిక మృతితో అశ్వరావుపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


పట్టాభి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పట్టాభి భవన నిర్మాణాన్ని ప్రారంభించాలి : టిడిపి,జనసేన


ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మచిలీపట్నంలో పట్టాభి స్మారక భవనం పనులు వెంటనే ప్రారంభించక పోతే పాలకులు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, జనసేన పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ ఇంచార్జ్ బండి రామకష్ణలు అన్నారు. పట్టాభి స్మారక భవన నిర్మాణం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ జిల్లా పరిషత్ సెంటర్ లోని కీర్తశేషులు భోగరాజు పట్టాభి సీతారామయ్య కాంస్య విగ్రహం వద్ద పలు రాజకీయ పార్టీల నాయకులు ఆదివారం నిరసన తెలిపారు ఈ సందర్భంగా బూరగడ్డ వేదవ్యాస్, బండి రామకష్ణ లతోపాటుగా ఆయా పార్టీల నాయకులు, పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు పట్టాభి సీతారామయ్య విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మన మచిలీపట్నం కేంద్రంగా ఆంధ్ర బ్యాంకు స్థాపించిన వ్యక్తి, ఆంధ్ర ఇన్సూరెన్స్ కంపెనీని స్థాపించిన మహానుభావుడు, కష్ణా కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ స్థాపించి రైతులకు సేవలందించారని, స్వాతంత్ర్య సమరయోధులు పట్టాభి సీతారామయ్య అని కొనియాడారు. ఆయన పేరు స్మారక భవన నిర్మాణానికి యూనియన్ బ్యాంకు రూ. 40 కోట్లు కేటాయిస్తే , భవన నిర్మాణానికి పాలకులు అడ్డుతగలడం సరైనది కాదన్నారు. జనసేన పార్టీ మచిలీపట్నం ఇన్చార్జి బండి రామకష్ణ మాట్లాడుతూ పట్టాభి స్మారక భవన నిర్మాణాన్ని ప్రారంభించాని అఖిలపక్షం, పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు పలుమార్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఏడాది క్రితం విన్నవించినా ఇప్పటికి పట్టించుకోలేదన్నారు. కొత్త ప్రభుత్వం రాగానే స్మారక భవనం నిర్మించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కే చంద్రశేఖర్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు, గడ్డం రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు, గుమ్మడి విద్యాసాగర్, కాసాని భాగ్య రావు, బోలెం అయోధ్య రామయ్య, పట్టాభి స్మారక భవన నిర్మాణ సాధన సమితి సభ్యులు, వేమూరి రామకష్ణారావు, పి ఎస్ ఎస్ ఆర్ శర్మ, పి.వి. ఫణి కుమార్, అయినంపూడి రాజశేఖర్, కే సుబ్బారావు, గూడూరు మండలం మాజీ జెడ్పిటిసి, బూరగడ్డ శ్రీ కుమార్, కాగిత చంటి, తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ హుడ్ గ్రూపుకు రూ 40,800 విరాళం

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చైల్డ్ హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితుడై మోపిదేవి మండలం కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన పంచాయతీ ఉద్యోగిగా ఉద్యో గ విరమణ చేసిన మత్తి


మత్తి సీతారామయ్య దంపతులకు సత్కారం

సీతారామయ్య తన నెల రోజుల పెన్షన్ రూ.40,800 విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఆ సంస్థ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రూపు ప్రధాన కార్యదర్శి దివి లీలా కృష్ణకు ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ మతిత సీతారామయ్య మాట్లాడుతూ 1981-84లో ప్రభుత్వ పాఠశాలలో విద్యనుభ్యసించిన విద్యార్థులు 35 సంవత్సరాల తర్వాత ఒక గ్రూపుగా ఏర్పడి వారికి అనేక బాధ్యతలు ఉన్నప్పటికీ ఆ బాధ్యత నెరవేరుస్తూ కూడా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సీతారామయ్య గోవర్ధనమ్మ దంపతులను శాలువాలు పూలదండలతో మిత్రులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ హుడ్ సోషల్ ఆర్గనైజేషన్ గ్రూప్ శాఖ అధ్యక్షులు అలపర్తి గోపాలకృష్ణ, యాసం శోభన్ బాబు, బండే శ్రీను, కమ్మిలి ప్రసాద్, ఘంటా శ్రీనివాసరావు, సామర్ల హనుమంత్, తుంగల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు పెండ్లి కానుక

ప్రజాశక్తి-మోపిదేవి

మోపిదేవి మండలంలోని వెంకటాపురం గ్రామంలోని శ్రీ హనుమాన్ లక్ష్మణ సీతా సమేత కోదండ రామస్వామి ఆలయంలో వివాహం చేసుకున్న నూతన వధూవరులకు రూ.10 వేలు పెండ్లి కానుకను ఆలయ ధర్మకర్తలు అందజేశారు. చల్లపల్లి



నగదు అందజేస్తున్న కందుల శ్రీనివాసరావు

నారాయణరావు నగర్ కు చెందిన బొందలపాటి సాయిబాబు-సామ్రాజ్యం దంపతుల కుమారుడు వెంకటేశ్వరరావు... చల్లపల్లి గ్రామానికి చెందిన పేరుబోయిన వెంకటేశ్వరరావు -లక్ష్మీల కుమార్తె నాగకుమారిల వివాహం ఆదివారం ఉదయం 9. 26 నిమిషాలకు వెంకటాపురం గ్రామంలోని కోదండ రామస్వామి వారి దేవస్థానంలో జరిగింది. దేవస్థానంలో వివాహం చేసుకు నే వధూవరులకు ఆలయ పునర్నిర్మాణ దాతలు కోనేరు వెంకట రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించే రూ.10 వేలు కానుకను ఆలయ కమిటీ సభ్యులైన కందుల శ్రీనివాసరావు అందజేశారు.

మాదివాడ వెంకటేశ్వరరావు ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు మాదివాడ వెంకటేశ్వరరావు ప్రథమ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో



టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ పాల్గొని వెంకటేశ్వర చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం బాబు, మాజీ జెడ్పీటీసీ కొల్లూరి వెంకటేశ్వరరావు, యలవర్తి చిన్న, బర్మా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


జర్నలిస్టుల హెల్త్ క్యాంపునకు విశేష స్పందన

- 1,200 మందికి పైగా తరలివచ్చిన జర్నలిస్టులు, కుటుంబసభ్యులు
- క్యాంప్‌లో ఉచితంగా 17 రకాల వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖల సౌజన్యంతో విజయవాడలోని ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కాలేజ్‌లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించిన క్యాంపులో 1,200 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని అవసరమైన వైద్య సేవలు పొందారన్నారు. 22 ప్రముఖ ఆస్పత్రులకు చెందిన అనుభవజ్ఞులైన వైద్య బృందం వైద్య సేవలు అందించిందని వెల్లడించారు. మామోగ్రామ్, హృద్రోగ సంబంధిత టెస్ట్‌లు, ఈసీజీ, 2డీఎకో, ట్రేడ్ మిల్ టెస్ట్(టిఎంటీ), ఆల్ట్రా సౌండ్ స్కానింగ్, సీబీపీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్, థైరాయిడ్, డయాబెటిక్ టెస్ట్‌లు, ఎక్స్ రే, కళ్లు, డెంటల్ పరీక్షలు వంటి తదితర 17 రకాల వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ముందుగానే ఆరోగ్య సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవడం ద్వారా జర్నలిస్టులు మరింత మెరుగైన జీవితాన్ని కొనసాగించాలన్నదే తమ తపన అన్నారు. కొత్తగా అక్రిడిటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులు హెల్త్ కార్డు పొందడానికి వీలైనంత త్వరగా రూ.1,250 చెల్లిస్తే, దీనికి ప్రభుత్వం తరపున మరో రూ.1,250 చెల్లిస్తామని ఆయన తెలిపారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి ఎం.టి కృష్ణబాబు రెండో రోజు కూడా హెల్త్ క్యాంపును సందర్శించారు. భవిష్యత్‌లో రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాల్లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని కృష్ణబాబు తెలిపారు. అనంతరం 22 ఆస్పత్రుల యాజమాన్యానికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో హరీంద్ర ప్రసాద్ చేతుల మీదుగా మెమొంటోలు అందజేశారు.



వివరాలు తెలుసుకుంటున్న కృష్ణబాబు


వైద్య సేవలందించిన వైద్య బృందం

స్వస్తిక్ రైస్ ఉత్పతులు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: స్వస్తిక్ రైస్ రిచ్ ప్రోడక్ట్ ను సినీనటి కామ్న జెత్మలాని ఆదివారము ప్రారంభించారు. నమ్మకమైన మేలు రకమైన రైస్‌ను స్వస్తిక్ వారు అందిస్తున్నారని తెలిపారు. నమ్మకమైన బ్రాండ్ కోరుకునే వరకు స్వస్తిక్ ఒక వేదికగా నిలుస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. నగరంలోని ఎన్ఎసి కళ్యాణ మండపంలో స్వస్తిక్ రైస్ రిచ్ ప్రోడక్ట్ ను ముఖ్యఅతిథిలుగా విచ్చేసిన సినీనటి కామ్న జెత్మలాని, మరో సినీ నటుడు ప్రస్నన్నకుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వస్తిక్ రైస్ రిచ్ ప్రోడక్ట్ ఎంతో నమ్మకమైనదని చాలా రుచికరమైనదని వివరించారు. స్వస్తిక్ రైస్ రిచ్ వాళ్ళు మేలు రకమైన విత్తనం నుంచి రైస్ ని పండిస్తారని వివరించారు. స్వస్తిక్ రైస్ లో ఎక్కువ ప్రోటీన్లు ఉంటాయని అందరూ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ ప్రోడక్ట్ ను ఎస్కే భాష, నాని లు వెలుగులోకి తీసుకువచ్చారని తరతరాలుగా ఈ బిజినెస్ లోనే కుటుంబమంతా ఉన్నారని తెలియజేశారు. దేశవ్యాప్తంగా స్వస్తిక్ రైస్ విస్తరించి ఉందని పేర్కొన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వస్తిక్ ఎంటర్ప్రైజెస్ నిర్వాహకులు నవీన్ కుమార్ గత 20 సంవత్సరాల నుంచి ఇదే ఫీల్డ్ లో ఉంటున్నారని, అందరికీ నమ్మకమైన రైస్ ను అందిస్తున్నారని తెలియజేశారు. అందరికి అందుబాటులో ఉండే విధంగా రాష్ట్రవ్యాప్తంగా మేలు రకమైన రైస్ ను స్వస్తిక్ వారు అందిస్తున్నారని వివరించారు. స్వస్తిక్ రైస్ రిచ్ దినాభివద్ధి కావాలని కోరుకుంటున్నానని ఆకాంక్షించారు.



వైసిపి నాయకులకు పరామర్శ

ప్రజాశక్తి-నందిగామ

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వీరులపాడు మండలం బోడవాడ గ్రామంలో జరిగిన దాడిలో గాయపడిన వైసిపి నాయకులు శీలం ఉదయ భాస్కర్ రెడ్డి, శీలం నాగిరెడ్డి, రాయల అనురాధలను నందిగామ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు, శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో అలజడులు సష్టించి టిడిపి వారు దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో విభేదాలు సష్టించి గొడవలు చేయటమే లక్ష్యంగా తెలుగుదేశం కార్యకర్తలు అల్లర్లు చేస్తున్నారన్నారు.

నేడు నందిగామకు జెసి రాక

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం కోసం ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ నందిగామలో జరిగే స్పందన కార్యక్రమంలో పాల్గొంటున్నారని నందిగామ ఆర్డీవో కార్యాలయం సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ముఖ్యంగా నందిగామ ప్రాంతంలో ప్రజలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న రైతాంగ సమస్యలు భూ సమస్యలు పట్టాదారు పాస్ పుస్తకాలు సమస్యలపై ప్రజల అర్జీలు అందించవచ్చును నందిగామ ఆర్డీవో రవీందర్రావు తెలిపారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: 104 రాష్ట్ర నాయకులు గత ఏడు రోజుల కార్యాచరణలో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను కలిసి 104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన 104 ఉద్యోగుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. మంత్రి కలిసిన వారిలో 104 యూనియన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డి సందీప్ కుమార్, కిరణ్ కుమార్, అప్పారావు, షఫీ ఉన్నారు.

కొనసాగుతున్న వేసవి శిబిరం

ప్రజాశక్తి-మైలవరం

వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆదివారం మైలవరం శాఖ గ్రంథాలయం నందు వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులతో సరదా కథలు పుస్తకాలు చదివించడం చెప్పించడం అయినది. చిలకలవారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు డి.వి.ఎస్ ప్రసాద్ భౌతిక రాశులు కొలతలు ప్రమాణాలు గురించి విద్యార్థిని విద్యార్థులకు బోధించడం జరిగినది. ఈ కార్యక్రమంలో 21 మంది విద్యార్థులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఉపాధి హామీ కూలీలలకు పేస్లిప్‌లు ఇవ్వాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలని, రూ.600 కూలీ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని కోరుతూ సమస్యల అధ్యయన యాత్ర పేరుతో వ్యవ సాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం జూపూడి పెద్ద లంక మూలపాడు శివారు త్రిలోచనాపురం, కేతనకొండ గట్టు చెరువు గ్రామాల్లోఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న పని ప్రదేశాలలోకి వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు వెళ్ళారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ గత సంవత్సరంలో నాలుగు వారాలు ఈ సంవత్సరంలో రెండు వారాలు బకాయిలు రా వాలని అధికారులు బకాయిలు అడుగుతుంటే బకాయిలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని రెండు పూటలా పనిచేయడం వల్ల ఎర్రటి ఎండలో చేస్తున్నారని రెండుపూటల పని విధానం రద్దు చేయాలన్నారు. వంద రోజుల పని చాలటం లేదని అదనంగా ఉపాధిహామీ పనిదినాలు పెంచాలని కనీసం రూ.600 వేతనం ఇవ్వాలని చేసిన పనికి ఎంత మొత్తం పడిందో తెలియాలంటే పే స్లిప్‌లు ఇవ్వాలని మేట్లకు శిక్షణ ఇవ్వాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మూలపాడు జూపూడి కేతనకొండ గ్రామాల మేట్లు కూలీలు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న కోట కళ్యాణ్



తల్లిదండ్రులను గౌరవించాలి

ప్రజాశక్తి-తిరువూరు: ఎవరైతే తల్లి తండ్రులను గౌరవిస్తారో, అటువంటివారే సమాజం నుండి గౌరవ మర్యాదలు పొందుతారని గంపలగూడెం తహశీల్దార్ జి.బాలకష్ణారెడ్డి అన్నారు. తిరువూరు గ్రంథాలయంలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ మా త దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని, వధ్యాప్య దశకు చేరుకున్న ప్పుడు వారి యోగక్షేమాలను చూసు కోవాల్సిన బాధ్యత పిల్లలదేనన్నారు. అనంతరం ఉపాధ్యాయిని కె.భరత కుమారి నేతత్వంలో గ్రంథాలయ సిబ్బంది పద్మావతి, శ్రీలతలను విద్యా ర్థులు ఘనంగా సన్మానించారు. మాత మూర్తి యొక్క గొప్పతనం గురించి మాట్లాడిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజే శారు. ఈకా ర్యక్రమంలో తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు టి.ఉమామహేశ్వ రావు, జెవివి జిల్లా కార్యదర్శి ఎం.రాం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మను దర్శించుకున్న భద్రాచలం ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని తెలంగాణ రాష్ట్రం భద్రాచలం శాసన సభ్యులు పోడం. వీరయ్య కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం ఆలయ అధికారులు, ధర్మకర్తలు కోలా. రామారావు వారికి అమ్మవారి స్వామివారి శేష వస్త్రాలు ప్రసాదాలు అందజేశారు. అలాగే స్వామివారి వజ్ర కిరీటం నిర్మాణానికి ప్రకాశం జిల్లా వినోదరాయుని పాలెం గ్రామానికి చెందిన చాలువాది సత్యనారాయణ దంపతులు ఆదివారం ఆలయ అధికారులకు 16,116 రూపాయలు విరాళాన్ని అందజేశారు.



కంచికచర్లలో అన్నదానం

ప్రజాశక్తి-కంచికచర్ల: హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం కంచికచర్ల మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పరిటాల సమీపంలో గల 135 అడుగుల ఎత్తుగల హనుమాన్ విగ్రహం వద్ద చాలీసా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిం చారు. స్థానిక శివాలయంలో అన్నదానం నిర్వహించారు. కీసర, మోగులూరు, పరిటాల, గని ఆత్కూరు, తదితర గ్రామాల్లో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

టిడిపి నిరసన

ప్రజాశక్తి-నందిగామ నందిగామ పట్టణంలోని డి.వి.ఆర్ కాలనీ 18 వ వార్డు లో టిడిపి ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అంటూ టిడిపి కార్యకర్తలు ఆదివారం సాయంత్రం నిరసన తెలియజేశారు. 18వ వార్డు టిడిపి నాయకుడు తోటకూర సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న వైసీపీ పార్టీని తుంగలో తొక్కాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కేవలం వైసీపీ కార్యకర్తకు మాత్రమే అందజేస్తున్నారని ఆరోపించారు. వైసిపి నాయకులు అవినీతి అక్రమాలు రోజురోజుకి పెచ్చిమీరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

